ఓ తల్లి
అనుగ్రహంకోసం
మరో తల్లిని
నిర్లక్ష్యంచేస్తే
అది ఎలాంటి భక్తి?

# మొక్కు తీరిందా?

సావిరాజు
కామేశ్వరరావు
కథ

ఎ.సి. కాబిన్‌లో చలి మరీ ఎక్కువగా ఉన్నట్లు అనిపించడంతో లేచి ఫ్యాన్ స్విచాఫ్ చేశాను.

పై బెర్తులమీద మా అమ్మాయి, అబ్బాయి రగ్గులు ముసుగుపెట్టుకుని పడుకున్నారు. క్రింద బెర్త్‌మీద మా ఆవిడ ముడిచిపెట్టుకుని వుంది.

కాబిన్ అంతా పల్చటి నీలంకాంతి!

నేను నా బెర్త్‌మీద వాలాను.

కుదుపు తెలియకుండా మెత్తగా చీకట్లో పరుగులు తీస్తోంది కంబద్ ఎక్స్‌ప్రెస్!

టైం పదిన్నర!


ఎగ్మూర్ స్టేషన్‌లో మేం ఈ బండెక్కి అప్పుడే రెండు గంటలు!

నాగపట్టణానికి మా ప్రయాణం! ఈ రూట్‌లో ఎప్పుడూ ప్రయాణం చేయలేదు. మధ్యలో ఏం స్టేషన్లు వస్తాయో కూడా తెలియదు. చూడడానికి కూడా ఏం కనిపించకుండా ఎ.సి. కంపార్ట్‌మెంట్‌లో వున్నాం!

నాగపట్టణం తెల్లవారుజాము ఐదింటికల్లా వచ్చేస్తుందట! నిద్రలో మా ఆవిడ కదిలింది - గాజుల గలగల!

తను హాయిగా నిద్రపోతోంది. మొహంలో పద్నాలుగేళ్ల క్రితపు మొక్కు తీరబోతోందన్న తృప్తి!

అవును - ఈ మొక్కు సరిగ్గా పధ్నాలుగేళ్ల క్రితంది! తను మా అమ్మాయి ప్రసవానికి ముందు మొక్కిన మొక్కు! బాగా నొప్పులు రావడంతో మా అత్తగారూ, బావమరిది తనని ఆటోలో తీసుకెళ్తున్నారట! మొదటి కాన్పు కావడంతో తనకి అమితమైన భయంగా వుంది. మాసాబ్‌ట్యాంక్ దాటాక, లక్డీకాపూల్‌కి ఇవతల



ట్రాఫిక్ జామ్ అయిపోయింది. పెద్ద ఊరేగింపు!

కళ్లు చెదిరిపోయే లైట్లమధ్య మేరీమాతను ఊరేగిస్తున్నారట!

ఆటోలోనే డెలివరీ అయిపోతుందేమో అని హడలిపోయిందట మా ఆవిడ! అసలు సుఖప్రసవం అవుతుందో లేదో అనే బెంగ ఒకప్రక్క!

ఆ ఊరేగింపు చూస్తే చిన్నతనంలో చూసిన

మేరీ మాత సినిమా, అందులోని సాగరతీర సమీపాన అన్న పాట గుర్తుకు వచ్చాయట! కష్టాల్లో కన్నతల్లిలా భక్తుల్ని కాపాడే 'వేళాంగణ్ణి' మేరీమాత కళ్లముందు కనిపించినట్లయిందట! పురుడు సవ్యంగా వచ్చి, అబ్బాయో, అమ్మాయో ఆరోగ్యంగా పుడితే ఇంటిల్లిపాది వేళాంగణ్ణి వస్తామని మొక్కుకుందట ఆ క్షణంలో! వేల్పుల మొక్కులు వెయ్యేళ్లంటారు! ఆ మొక్కు తీర్చుకోవడానికి మాకిప్పటికి కుదిరింది.

ఎండల్లో తిరగడం ఇష్టంలేక, వర్షాలు ఆరంభం అయ్యాక కొత్తలో పిల్లలకి ఓ వారం స్కూలుపోయినా ఫర్వాలేదని జూలై మొదటివారంలో ఎల్.టి.సి పెట్టుకుని ప్రయాణం అయ్యాం! హైదరాబాద్‌నుంచి ముందు తిన్నగా తిరుపతి వెళ్లాం! రాజమండ్రినుంచి మా అత్తగారు, బావమరిది, వదినగారు, మరదలు అంతా కుటుంబాలతో వచ్చారు! తిరుపతినుంచి అంతా మద్రాస్ వచ్చాం! వాళ్లు మద్రాస్‌లో ఆగిపోయారు. మా కుటుంబం మాత్రం ఈ ప్రయాణం కొనసాగిస్తున్నాం!

కంప్యూటర్ల పుణ్యాన ఈ రిజర్వేషన్లన్నీ హైదరాబాద్‌లోనే చేయించేశాను నేను! మళ్లీ రేపు ఇదే ట్రైన్‌కి మద్రాస్‌కి తిరుగు రిజర్వేషన్ అయిపోయింది మాకు!

ఈ ప్రయాణం మొదలయినప్పటినుంచీ మా ఆవిడకి ఒకటే కంగారుగా వుంది! తెల్లవారి నాగపట్టణంలో దిగుతాం! అక్కడినుంచి వేళాంగణ్ణి బస్సులో వెళ్లాలి! బస్సు ఎప్పుడు దొరుకుతుందో? ఎంతదూరం ప్రయాణమో! వేళాంగణ్ణిలో దర్శనానికి ఎంత టైం పడుతుందో? తిరిగి రాత్రి రైలుకి అందుకోగలమో లేదో! ఒకటే బెంగగా వుంది ఆవిడకి!

రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది.

విండో కర్టన్ పక్కకి జరిపి చూశాను. మసకమసకగా కనిపిస్తోంది.

తమిళం బోర్డు - అర్థంకాలేదు.

బయట చినుకులు పడుతున్నట్లుగా వున్నాయి. పల్చగా జనం అటూ ఇటూ పరుగెడుతున్నారు.

మళ్లీ రైలు కదిలింది.

కర్టెన్ లాగేసి వెల్లకిలా పడుకున్నాను!

అప్పుడే ఇల్లువదిలి నాలుగురోజులు!

బాగా అలిసిన శరీరం విశ్రాంతిని కోరుతోంది.

కళ్లు బరువుగా మూతలు పడుతున్నాయి.

మళ్లీ ఎవరో కాబిన్ తలుపు చప్పుడు చేస్తున్న శబ్దానికి మెలకువ వచ్చింది. టైం ఐదు.

''మరో పది నిమిషాల్లో నాగపట్టణం వస్తోందిసార్!'' డోర్ తీయగానే చెప్పాడు తెలుగు అటెండెంట్.

ఆ మాటలకి మా ఆవిడ ఒక్క ఉదుటున లేచి పిల్లల్ని తట్టిలేపింది!

మూడు సూట్‌కేసులు ఎగ్మూర్ స్టేషన్‌లో క్లోక్ రూంలో పెట్టుకుని, మాతో ప్రయాణానికి ఒక సూట్‌కేస్ మాత్రం తెచ్చుకున్నాం!

సూట్‌కేసు మా అబ్బాయి పట్టుకున్నాడు.

వాటర్‌కాన్ మా అమ్మాయి.

హ్యాండ్‌బ్యాగ్ భుజానికి తగిలించుకుంది మా ఆవిడ.

నేను రెండు చేతులూ ప్యాంట్ జేబుల్లో పెట్టుకున్నాను. నాగపట్టణం చాలా చిన్న స్టేషన్! రైల్లో చాలామంది అక్కడి దిగిపోయారు. రైలు కొంచెం పైకి నాగూర్‌దాకా వెళుతుందట!

స్టేషన్‌లో ఒక్కడంటే ఒక్కడే కూలీ కనిపించాడు.

మాకు కూలీ అవసరంలేదు.

మావాళ్లని ఒక పక్కన నిలబడమని చెప్పి, నేను స్టేషన్ మాస్టర్ రూంలోకి వెళ్లాను. రిటైరింగ్ రూం అడగడంకోసం! ఆయన తమిళంలో ఏదో చెబుతున్నాడు!

''తమిళ్ తెరియాద్!'' రెండురోజులు మద్రాస్‌లో వుండి నేర్చుకున్నవాక్యం అది!

స్టేషన్ మాస్టర్ ఇంగ్లీష్‌కూడా తమిళంలాగానే ధ్వనించింది!

ఆయన చెప్పినట్లుగా బయట వున్న కౌంటర్‌లోంచి రిటైరింగ్ రూం టికెట్లు తెచ్చాను. మేం నలుగురం కాబట్టి నూట నలభై రూపాయలు ఛార్జ్ చేశారు.

రిటైరింగ్ రూమ్ తలుపు తీయగానే ఎన్నాళ్లనుంచో వాడనట్లుగా అదో రకం ముక్కవాసన!

రూం మాత్రం నమ్మశక్యం కానంత విశాలంగా హైద్రాబాద్‌లో మా ఇల్లంత వుంది.

''కాస్సేపు రెస్ట్ తీసుకుందాం!'' మంచంమీద వాలాను నేను.

''రెస్ట్‌కోసం రాలేదు మనం - మొక్కు తీర్చుకోడానికి!'' బ్రష్‌మీద పేస్ట్ వేసుకుంటూ అంది మా ఆవిడ.

తను స్నానం చేశాక, పిల్లలిద్దరూ బ్రష్ చేసి స్నానం చేసి వచ్చారు.

అప్పుడు నేను లేచాను.

నలుగురం తయారై రిటైరింగ్ రూంనుంచి బయటకు వచ్చేసరికి ఏడున్నర అయింది.

బయట ముసురు. రివ్వున గాలి.

నేను ఆ పాత తాళంకప్ప పడిందో లేదో అని లాగి చూస్తుంటే ''త్వరగా మళ్లీ రాత్రికి రాగలమో లేదో'' తొందర పడిపోతోంది మా ఆవిడ.

''అసలే సముద్రపు ఒడ్డు. ఏ తుఫానో పట్టుకుంటే దారిలో చిక్కుపడతాం'' మళ్లీ తనే అంది కాటుక పులుముకున్నట్లున్న ఆకాశంవైపు ఆందోళనగా చూస్తూ.



మేం చూడకుండా మద్రాస్‌లో కొన్న బంతి తనతో తెచ్చుకున్నట్టున్నాడు మా అబ్బాయ్. అది చేయిజారిందో, వాడే విసిరాడో ప్లాట్‌ఫాం ఈ వైపు చివరికంటా దొర్లిపోయింది!

మేం బయటకు వెళ్లడానికి ఆ వైపుకు వెళ్లాలి!

ప్లాట్‌ఫాంమీద మరో పిట్ట కనిపించడంలేదు.

మా అబ్బాయి ''మీరు నడుస్తూండండి. బంతి తీసుకు వచ్చేస్తాను!'' అంటూ ఆ వైపుకు పరిగెత్తాడు.

మేం ముగ్గురం నడుస్తున్నాం!

మెయిన్ ఎంట్రన్స్‌కి చేరుకోకముందే ''మమ్మీ... డాడీ... మరి... మరి'' పరుగెత్తుకువచ్చిన మా అబ్బాయి ఆయాసపడుతున్నాడు.

''ఎందుకంత పరుగు?'' కోప్పడింది మా ఆవిడ - ''ఊ వగర్చేలా పరిగెత్తాలా?''

''మరే... మమ్మీ... అక్కడ బెంచీమీద ఒక ఆంటీ పడుకుని వుంది. అరవంలో ఏదో అంటోంది. నాకు పూర్తిగా అర్థంకాకపోయినా మిమ్మల్ని పిలవమంటోందని అనుకుంటా - పాపం ఏడుస్తోంది!''

అప్పుడు చూశాను నేను. ఆ చివరివైపు ఆరుబయట సిమెంట్ బెంచీమీద ఎవరో పడుకుని వున్నారు. ఆకుపచ్చ చీర!

''మనకి టైం ఎక్కడుంది?'' మళ్లీ ఆ చివరికి వెళ్లాలని లేనట్లుగా వుంది మా ఆవిడకి!

''ఆ ఆంటీ పొట్ట పట్టుకుని గట్టిగా ఏడుస్తోంది మమ్మీ!'' పెద్దవాళ్లు ఏడవడం విచిత్రంగా వున్నట్లుంది వాడికి.

''ఒకసారి వెళ్లి చూసివద్దాం పద!''

నా వెనక రాక తప్పలేదు మా ఆవిడకి!

ఆ బెంచీమీద ఒక ముప్పై ఏళ్ల స్త్రీ బాధతో మెలికలు తిరిగిపోతోంది! నెలలు నిండినట్లుగా పొట్ట చాలా ఎత్తుగా కనిపిస్తోంది. చీరమీద రక్తస్రావం స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె చేతులు జోడించి తమిళంలో ఏదో చెబుతోంది! భాష తెలియకపోయినా ఈ గండంనుంచి తనని గట్టెక్కించమని అర్థిస్తున్నట్లుగా స్పష్టంగా అర్థం అయిపోతోంది.

''బయటకు తీసుకెళ్లి ఏ రిక్షాయో ఎక్కించి ఆస్పత్రికి పంపిద్దాం!'' జాలిగా అన్నాను నేను!

''ఈవిడ నడవగలగడం అనుమానమే!''

మా ఆవిడ అన్నదీ నిజమే! ఆమె తనంతట తాను నడిచే స్థితిలో లేదు.

''నువ్వు సాయం పట్టకూడదూ?''

''నేనా?'' అదిరిపడింది మా ఆవిడ. ''ఇంకా నయం! శుభ్రంగా తలారా స్నానం చేసి మేరీమాత దర్శనానికి బయలుదేరాను. ఆ రక్తం అదీ అంటుకుంటే మళ్లీ తలస్నానం చేయాలి! అయినా మనకి మొక్కు తీరడం ముఖ్యం! టైం లేనప్పుడు అక్కరలేనివన్నీ ఎక్కడ నెత్తికెత్తుకుంటాం! అవతల రైల్వే ఉద్యోగులు ఎవరికైనా చెబుదాం పదండి!''

ఈసారి మా ఆవిడను అనుసరించలేక తప్పలేదునాకు!

బయటకు వెళ్లే గుమ్మంలోనే చిన్న బంకులాంటిది వుంది. అందులో ఎవరో ముసలి మనిషి ఉన్నాడు.

ఇంగ్లీష్‌లో అతనికి ఆ స్త్రీగురించి చెప్పాను.

అర్థంకాలేదు.

హిందీలో చెప్పాను. అదీ తెలిసినట్లు లేదు!

''కౌంటర్‌లో వున్న క్లార్కు కెవరికైనా చెప్పండి!'' ఆలస్యం అయిపోతోందని అసహనంగా అంది మా ఆవిడకి.

కౌంటర్‌లో వున్న మనిషికి ఇంగ్లీష్‌లో అంతా వివరించాను.

''ఆఫ్టరాల్ షి ఈజ్ బెగ్గర్!'' అన్నాడు ఎంత తేలిగ్గా.

''మేబీ - బట్ షీ ఈజ్ ప్రెగ్నెంట్ - సఫరింగ్ విత్ సివియర్ పెయిన్స్ ఎండ్ బ్లీడింగ్. యూ మస్ట్ హెల్ప్ హర్'' అన్నాను కొంచెం ఆవేశంగా.

''చెప్పారుగా - ఇక పదండి!'' మోచేత్తో పొడిచింది మా ఆవిడ.

స్టేషన్ బయట రోడ్డుమీదికి వచ్చాం! చుట్టుప్రక్కల అన్నీ నాన్‌వెజ్ హోటల్స్ - ఒకటే చిన్న వెజిటేరియన్ హోటల్ వుంది. బ్రతుకు జీవుడా అనుకుని లోపలకు వెళ్లాం.

ఒక ముసలి పంచకట్టు అయ్యర్ అరిటాకు ముక్కలు తెచ్చి మా ముందు పరిచాడు.

అరవంలో ఏదో అడిగాడు.

''ఇడ్లీ-వడ'' అన్నాను జవాబుగా.

అందరి ఆకుల్లోనూ రెండేసి ఇడ్లీలు, ఒక్క వడ వేశాడు. కొబ్బరి పచ్చడి వడ్డించాడు. చిక్కటి సాంబారుకూడా తెచ్చి ఆకులో పోశాడు. టిఫిన్ అయ్యాక కాఫీలు తాగాం!

బిల్లు చెల్లిస్తూ కౌంటర్‌లో వున్న మనిషిని వేళాంగణ్ణి గురించి వివరాలు అడిగాను!

షరా మామూలే - జవాబు తమిళంలోనే!

అర్థం అయిందేమిటంటే కొంచెం ముందుకు వెళితే బస్సు దొరుకుతుందని - అరగంట ప్రయాణం అని!

మేం ఐదు నిమిషాలు ఎదురుచూసేసరికే బస్సు వచ్చేసింది. వేళాంగణ్ణికి రెండు రూపాయల టికెట్! బస్సు కదిలింది. బాగా వెనుకబడిన ప్రాంతం అనిపించింది. రొయ్యల చెరువులను దాటుకుంటూ తొమ్మిదింటికల్లా మమ్మల్ని వేళాంగణ్ణిలో దింపేసింది బస్సు!

తిరుపతిలో ముప్పై రూపాయల ప్రత్యేక దర్శనం క్యూలో ఆరు గంటల నిలువుకాళ్ల జపం చేస్తేనేగానీ ఏడుకొండలవాడి దర్శనం లభించలేదు మాకు!

ఇక్కడ అరనిమిషంలోనే మేరీమాత దర్శనం

## పాసైతే



''ఒరే శేఖర్. నువ్వు గనక పాసైతే నీకు కారు కొనిస్తా.'' అన్నాడు తండ్రి.

''మరి నేను పాస్ కాకపోతే'' అడిగాడు కొడుకు.

''ఆటో కొనిస్తా'' ఠక్కున చెప్పాడు తండ్రి.

-ముద్దా రమణమూర్తి (అనంతపురం)

అయింది!

విశాలమైన చర్చి ఎంతో శుభ్రంగా, గంభీరంగా, నిశ్శబ్దంగా వుంది!

మేరీమాత విగ్రహం దయను కురిపిస్తూ ఎంతో మనోహరంగా వుంది.

కొందరు విగ్రహం ముందు కొద్ది దూరంలో తల మీదుగా చీర కొంగు కప్పుకుని, కళ్లు మూసుకుని ప్రార్థన చేసుకుంటున్నారు.

కొందరు క్యాండిల్స్ వెలిగిస్తున్నారు. ఎక్కడా డబ్బు ప్రస్తావన లేదు.

మా ఆవిడ మా అమ్మాయిచేత ప్రత్యేకంగా దండం పెట్టించి, హుండీలో డబ్బు వేయించింది.

అరగంటలో ఇవతలకు వచ్చాం! అటూ ఇటూ వున్న దుకాణాలను దాటుకుని ఫర్లాంగు దూరంలో వున్న సముద్రపు ఒడ్డుదాకా నడిచి వెళ్లాం!

అక్కడ సముద్రంకూడా మేరీమాత విగ్రహంలా ఎంతో ప్రశాంతంగా వుంది.

పొద్దున్న వున్న ఈదురుగాలి ఇప్పుడు లేదు.

పల్చగా ఎండ!

నలుగురం కొబ్బరి బోండాలు తాగాం! పంచదార కలిపినంత తీయగా వున్నాయి నీళ్లు!

అక్కడి వాతావరణానికి ముగ్ధులైన పిల్లలు, ''మీ కెనరాబ్యాంకు బ్రాంచ్ ఇక్కడ వుండే ఎంచక్కా ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని వచ్చేసి వుండేవాళ్లం డాడీ!'' అన్నారు.

''ఎందుకూ? ఎక్కడా స్కూళ్లు కనిపించడంలేదనా?'' ఇక బయలుదేరండన్నట్లుగా చీరకి అంటుకున్న ఇసుక దులుపుకుంటూ లేచింది మా శ్రీమతి.

తిరిగి వస్తూ గవ్వలతోనూ, ఆల్చిప్పలతోనూ చేసిన డెకరేటివ్ సామాగ్రి కొంటూ నా సహనానికి పరీక్ష పెట్టింది.

మేం నాగపట్టణానికి తిరిగి వచ్చేసరికి ఒంటిగంట అవుతోంది! ప్రొద్దున్న టిఫిన్ తిన్న హోటల్‌లోనే అరిటాకుల్లో అన్నం తిని, రిటైరింగ్ రూంకి బయలుదేరాం!

నా మనసంతా పొద్దున్న చూసిన గర్భిణీ స్త్రీమీదే వుంది!

ఇప్పుడు ఎలా వుందో?

ఆ రైల్వే ఉద్యోగి ఆమెను ఆస్పత్రికి తరలించాడో లేదో!

ప్లాట్‌ఫాంమీదికి రాగానే ఆ చివర గుంపుగా వున్న పదిమందిని చూడగానే నా మనసు కీడును శంకించింది.

నలుగురం గబగబ ఆ వైపుకు వెళ్లాం!

పొద్దున్న బాధతో విలవిలలాడిన స్త్రీ ఏ జీవం లేకుండా నిశ్చలంగా వేలమీద!

ఆ ప్రక్కనే ఇంకా కళ్లు తెరవకుండానే కళ్లు మూతబడిన బిడ్డ!

నా హృదయం వికలం అయింది!

మా ఆవిడ మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు!

ఏమనుకుందో పర్సులోంచి వందరూపాయలనోటు తీసి ఆ స్త్రీ ప్రక్కన వుంచింది!

నిశ్శబ్దంగా నలుగురం రూంలోకి వచ్చేశాం!

ఆ రాత్రి తిరుగుప్రయాణం అయ్యాం!

రైలు కదలగానే ''హమ్మయ్య! ఇప్పటికి నా ప్రాణం కుదుటపడింది. ఎన్నేళ్ల మొక్కో ఈనాటికి తీరింది!'' అంది శ్రీమతి ఆనందంగా.

''మొక్కు తీర్చడానికి వేలమైళ్లు ప్రయాణించి, గంటలతరబడి ఓపిగ్గా క్యూలో

నిలబడే మనిషి ఆపదలో వున్న తోటి మనిషికోసం పది నిమిషాలు వెచ్చించడానికి ఆలోచిస్తాడు. మేరీమాత నీకు చేసిందనుకుంటున్న ఉపకారానికి మొక్కుబడిగా ఇక్కడికి వద్దాం అనుకున్నావు. అంతకంటే పొద్దున్న కష్టంలో వున్న తోటి స్త్రీని ఆదుకుని వుంటే, ఒకవేళ ఆ పనివల్ల ఆవిడను దర్శించుకోలేకపోయినా నీ మొక్కు తీరినట్లుగా ఆ తల్లి ఆశీర్వదించి వుండేదేమో!'' అన్నాను నేను.

మా ఆవిడ ఏమీ మాట్లాడలేదు.

బహుశా తన మొక్కు తీరిందో లేదో అని ఆలోచనలో పడినట్లుంది!

